లేఅవుట్లు.. ఇక్కట్లు

- అనధికార లేఅవుట్లతో జనం అవస్థలు
- పచ్చని చేలను పూడ్చివేస్తున్న వైనం
- ప్రభుత్వ నిబంధనలను పాటించని అక్రమార్కులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

తాళ్లరేవు: ప్రతి ఒక్కరి జీవితంలో సొంతిల్లు నిర్మించుకోవడం ఓ కల. అన్ని సౌకర్యాలు, సదుపాయాలతో ఇల్లు నిర్మించుకుని అందులో హాయిగా జీవించాలని ప్రతిఒక్కరూ ఆశ పడుతారు. ఆ కలను నిజం చేసుకోవడానికి జీవితాంతం కష్టపడుతుంటారు. పలువురు అక్రమార్కులు వారి ఆశలను అడియాసలు చేస్తున్నారు. ప్రజల అవసరాన్ని సాకుగా చేసుకుని ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా పచ్చని చేలను పూడ్చివేసి అనధికార లేఅవుట్లు వేస్తున్నారు. మాయ మాటలతో ఇళ్ల స్థలాలను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకపోవడంతో ఆ స్థలాలను కొనుగోలు చేసిన జనం అనేక అవస్థలు పడుతున్నారు. అనధికార లే అవుట్లతో రిజిస్ట్రేషన్ సమస్యలతో పాటు భవన అనుమతులకు ఆటంకం కలుగుతోంది. రహదారులు, డ్రైనేజీలు, ఇతర సౌకర్యాలు లేకపోవడం, విద్యుత్, నీటిసరఫరాకు ఆటంకం కలగడంతో వారిపడే తిప్పలు అన్నీ, ఇన్నీ కావు. దీంతో అందమైన ఇల్లు నిర్మించుకోవాలనుకునే వారి కల, కలగానే మిగిలిపోతోంది.


చొల్లంగిలో పచ్చని చేలను పూడ్చివేస్తున్న దృశ్యం


జార్జిపేటలో వసతులు లేని అనధికార లే అవుట్


నీలపల్లిలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన లేఅవుట్

అధికారం ముసుగులో..

ఒక లేఅవుట్ వేయాలంటే ప్రభుత్వ అనుమతులతో పాటు ఎన్నో నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీ, మైనింగ్ తదితర శాఖల అనుమతులు పొందాలి. అక్రమార్కులు అధికారం ముసుగులో ఆయా నిబంధనలు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని పలువురు అక్రమార్కులు జోరుగా రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరతీస్తున్నారు. కనీసం లేఅవుట్ వేసే స్థలాన్ని సైతం కన్వర్షన్ కూడా చేయకుండా లేఅవుట్లు వేసి సొమ్ము చేసుకుంటున్నారు. లే అవుట్‌కు సంబంధించి కనీస మౌలిక వసతులు కల్పించకపోవడంతో పాటు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజులు, పన్నులు చెల్లించకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ఆయా లేఅవుట్‌లలో స్థలాలు కొనుగోలు చేసిన వినియోగదారులపై అదనపు భారం పడుతోంది. ఇలా ఉండగా గత ప్రభుత్వం తీసుకువచ్చిన లేఅవుట్ విస్తీర్ణంలో 10 శాతం స్థలాన్ని సామాజిక అవసరాలకు కేటాయించాల్సి ఉండగా ఆ స్థలాన్ని కూడా చూపకుండా విక్రయాలు సాగించడం గమనార్హం. ఇంత జరుగుతున్నా రాజకీయ ఒత్తిళ్లతో పాటు పలువురు అధికారులు కాసులకు కక్కుర్తిపడి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ■

ప్రభుత్వ భూములకు ఎసరు

అనధికార లేఅవుట్ల కారణంగా పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు సైతం కనుమరుగవుతున్నాయి. లేఅవుట్ల పేరుతో కొనుగోలు చేసిన స్థలాల చెంతనగల ప్రభుత్వ పోరంబోకు భూములు, గ్రామకంఠం భూములు, ఇరిగేషన్, డ్రైనేజీల చెంతన ఉంటే ప్రభుత్వ స్థలాలకు ఎసరు పెడుతున్నారు. లేఅవుట్‌కు చేర్చి ఉన్న ప్రభుత్వ స్థలాలను సైతం కలుపుకుని విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో ప్రభుత్వ భూములు ఐక్కచిక్కిపోతున్నాయి. పంటకాలువలు, ఊటకాలువల చెంతన అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో ప్రజలకు తాగు, సాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారం ముసుగులో అక్రమ వ్యాపారాలు సాగిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలుగజేస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని, అనధికార లేఅవుట్లపై అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అనధికార లే అవుట్లు వేసి ప్రజలను మోసగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. లేఅవుట్లు వేయాలంటే తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలి. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సంబంధిత ఫీజులు చెల్లించడంతో పాటు నిబంధనలన్నింటినీ కచ్చితంగా పాటించాలి. నిబంధనలను ఉల్లంఘించి లేఅవుట్లు వేసి స్థలాల విక్రయాలు సాగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

పితాని త్రినాథరావు, తహసీల్దార్, తాళ్లరేవు మండలం

క్లుప్తంగా

బాస్కెట్ బాల్ జిల్లా జట్టుకు విద్యార్థుల ఎంపిక


బాస్కెట్ బాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుధీర్‌బాబు

అమలాపురం టౌన్: రామచంద్రపురంలో ఇటీవల జరిగిన అండర్-19 బాస్కెట్ బాల్ జిల్లా స్థాయి సెలక్షన్స్‌లో అమలాపురం విద్యానిధి కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపిక య్యారు. బాలుర విభాగంలో చప్పిడి భార్గవ్ నాగ మణికంఠ, బాలికల విభాగంలో చింతా లావణ్యశ్రీ ఎంపికైనట్టు ఆ కళాశాల అధికారులు తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టుకు ఎంపికైన వీరు ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకూ శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ బి.సుధీర్ బాబు అభినందించారు.

బండారులంకలో తాచుపాము హల్‌చల్


బండారులంకలో స్నేక్ క్యాచర్ పట్టుకున్న తాచుపాము

అమలాపురం రూరల్: మండలంలో బండారులంకలో బుధవారం తాచుపాము హల్‌చల్ చేసింది. ఉప సర్పంచ్ కామిశెట్టి శ్రీనివాసరావు ఇంట్లోకి ఎనిమిది అడుగుల తాచుపాము రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. వెంటనే ఉప్పలగుప్తం మండలం భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్ వర్మకు సమాచారం అందించారు. ఆయన వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పామును చాకచక్యంగా పట్టుకుని బంధించారు. వర్మను స్థానికులు అభినందించారు.

ఘనంగా లక్ష బిల్వార్చన

అల్లవరం: గ్రామంలో కొలువైన ఉమా సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో బుధవారం లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. వేద పండితుడు మంగళంపల్లి పాండురంగ విఠల్ ఆధ్వర్యంలో సామివారికి మారేడు దళాలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


ఉమామల్లేశ్వరస్వామికి బిల్వార్చన చేస్తున్న వేద పండితులు

29న శత సహస్ర పంచ ముఖ రుద్రాక్ష పూజ

అమలాపురం టౌన్: స్థానిక రవణం వీధి శివాలయం రోడ్డులోని సర్వ మంగళ రామలింగేశ్వర, ప్రసన్నాంజనేయ, షిర్డీ సాయిబాబు, మోక్ష గణపతి ఆలయాల సముదాయంలో ఈ నెల 29న శత సహస్ర పంచ ముఖ పూజామహోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయాల అనువంశిక ధర్మకర్తల మండలి చైర్మన్ మాచిరాజు రవి కుమార్ బుధవారం తెలిపారు. పవిత్ర కార్తిక మాసం సందర్భంగా గత 24 సంవత్సరాలుగా ఈ పూజా మహోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ఆ రోజు రామలింగేశ్వరస్వామికి కాశీ నుంచి రప్పించిన శత సహస్ర పంచ ముఖ రుద్రాక్షలు, సర్వమంగళాదేవికి శత సహస్ర కుంకుమ, మోక్ష గణపతికి శత సహస్ర గరిక, షిర్డీ సాయిబాబాకు శత సహస్ర బిల్వార్చన, ప్రసన్నాంజనేయస్వామికి శత సహస్ర నాగవల్లీ దళ పూజలు నిర్వహిస్తారని వివరించారు. అదే రోజు రాత్రి ఆలయాల ప్రాంగణంలో నిర్వహించే కార్తిక అన్నసమారాధన, ప్రసాద వితరణ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డాక్టర్ జేవీఎల్‌కు సత్కారం


జేవీఎల్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే దాట్ల

ఐ.పోలవరం: విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయులు డాక్టర్ జేవీఎల్ నరసింహారావును మురమళ్లలో బుధవారం ఘనంగా సత్కరించారు. రాజస్థాన్‌కు చెందిన గ్యాన్ ఉదయ్ ఫౌండేషన్ ప్రతిష్టాత్మక గ్లోబల్ ఐకాన్ అంతర్జాతీయ అవార్డు జేవీఎల్‌ను వరించింది. గత నలభై సంవత్సరాలుగా ఆంగ్ల ఉపాధ్యాయులుగా, శిక్షకుడిగా, వ్యాస రచయితగా, సామాజిక సేవకుడిగా విశేష కృషి చేసినందున ఆయనకు ఈ అవార్డు దక్కింది. జేవీఎల్‌కు ఇప్పటి వరకు ఇదే సంస్థ నుంచి ఇండియన్ ఐకాన్, ఇంటర్నేషనల్ ఐకాన్ అవార్డులు లభించాయి. ఆంగ్ల భాష, సామాజిక సేవా రంగాలకు నరసింహారావుకు అనేక జాతీయ, అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థల నుంచి ఇప్పటి వరకూ 5 జాతీయ అవార్డులు, 6 అంతర్జాతీయ అవార్డులు, మూడు ప్రపంచ రికార్డులు లభించాయి. గ్లోబల్ ఐకాన్ అవార్డు అందుకున్న జేవీఎల్‌ను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు(బుచ్చిబాబు) ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుత్తుల సాయి, నాగిడి నాగేశ్వరరావు, గోకవరపు వెంకట రాజు(పెదబాబు), జగతా జానకిరామయ్య, వెంకయ్య, పద్మ నాభరావు, నక్కా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పనులు ఎందుకు ప్రారంభించరు?


పీడబ్ల్యూడీ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అశోక్. చిత్రంలో ఆర్ఏఓ మునిస్వామి తదితరులు

ఎమ్మెల్యే అశోక్ ఆగ్రహం

యానాం: నియోజకవర్గ పరిధిలో పలు మౌలిక సౌకర్యాల కల్పనకు, అభివృద్ధి పనులకు సీఎస్ఆర్, ఎమ్మెల్యే ల్యాడ్, ఆదిద్రావిడ సంక్షేమ నిధులు మంజూరైనా మూడేళ్లుగా ఎందుకు పనులు ప్రారంభించలేదని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పీడబ్ల్యూడీ అధికారులను ప్రశ్నించారు. బుధవారం పీడబ్ల్యూడీ కార్యాలయంలో వివిధ అభివృద్ధి పనులకు మంజూరైన నిధులు, పనులు ప్రారంభించకుండా జాప్యం చేయడం తదితర అంశాలపై ఆయన ఆర్ఏఓ మునిస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన పనుల నిలిపివేతపై పుదుచ్చేరిలో ఉన్న పీడబ్ల్యూడీ కార్యదర్శి, డైరెక్టర్లతో మాట్లాడారు. సీఎస్ఆర్ నిధులు తొలి విడతలో ఎస్ఐటీలో ఉన్న తొమ్మిది పనులపై మాట్లాడి, పనులు ప్రారంభించడానికి ఇబ్బందులు లేకుండా చేశారు. అదేవిధంగా ఒన్ స్టాప్ సెంటర్, కనకాలపేట ఇండోర్ స్టేడియం, మిగిలిన అసంపూర్ణంగా ఉన్న పనులు పూర్తి చేయాలని సూచించారు. వాటిని ప్రారంభించి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. అరటికాయలంక నుంచి రాజీవ్ బీచ్ ఆర్చ్ వరకు రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించినా, పనులు ప్రారంభించక పోవడానికి కారణాలపై ఆరా తీశారు. కాంట్రాక్టర్‌ను తక్షణం పనులు ప్రారంభించాలని చెప్పాలన్నారు. పుదుచ్చేరిలో అధికారులు, కార్యదర్శులు, ఆర్థికపరమైన సమస్యలుంటే తన దృష్టికి తెస్తే, స్వయంగా పుదుచ్చేరి వెళ్లి కలుస్తానన్నారు. మున్సిపాలిటీకి సంబంధించిన పనులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. యానాం-ద్రాక్షారామ రోడ్డు గ్యాస్ పైపు పనుల వల్ల గుంతలు పడ్డాయని, వాటికి సంబంధించిన పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీడబ్ల్యూడీ ఏఈలు కాళ్ల నాగరాజు, జేఈ జ్యోతిరాజు, భాస్కర్, జేఈ కుమార్, ఆదిబు, వేణు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


శిక్షణ పూర్తి చేస్తున్న అభ్యర్థులతో జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాసరావు తదితరులు

అమలాపురం రూరల్: ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రవాణా అధికారి శ్రీనివాసరావు సూచించారు. అమలాపురం ఆర్టీసీ డిపోలో తొమ్మిదో బ్యాచ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 16 మంది హెవీ డ్రైవింగ్ ట్రైనీలకు బుధవారం సర్టిఫికెట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ అమలాపురం డిపోలో హెవీ డ్రైవింగ్ స్కూల్ ద్వారా ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని నైపుణ్యం పెంచుకోవాలన్నారు. డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఆర్టీసీ శిక్షణ కళాశాలలో డ్రైవర్లకు ప్రాక్టికల్ శిక్షణతో పాటు బస్సుల నిర్వహణపై అవగాహన కల్పిస్తామన్నారు. త్వరలో 10వ బ్యాచ్ శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 73829 09588 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ ప్రతిమా కుమారి, గ్యారేజ్ ఇంచార్జి జీఆర్‌డీఎల్ దేవి, ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ ఎస్.వరహాల బాబు తదితరులు పాల్గొన్నారు

మహిళా ఆరోగ్యంపై అవగాహన సదస్సు

యానాం: కుటుంబంలో స్త్రీల ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని పలువురు వక్తలు తెలిపారు. బుధవారం స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాతా, శిశు సంక్షేమ శాఖ, డిస్ట్రిక్ట్ మిషన్ శక్తి సంయుక్తంగా స్త్రీల ఆరోగ్యం, పరిశుభ్రత అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, స్త్రీల ఆరోగ్యం, పరిశుభ్రతపై శాస్త్రీయ వైద్య విధానంతో పాటు, భారతీయ ఆయుర్వేద వైద్య విధానంలో ఉన్న ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఎస్‌టీపీపీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రభ మాట్లాడుతూ, స్త్రీ విద్య వల్ల మహిళా సాధికారతను వివరించారు. డిస్ట్రిక్ట్ మిషన్ శక్తి కో-ఆర్డినేటర్ రిబ్కా మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం మిషన్ శక్తి ద్వారా బాలికలకు సేఫ్టీ, సెక్యూరిటీ, ఎంపవర్‌మెంట్ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీలత, అధ్యాపకులు డాక్టర్ టి ముత్యాలు, ఉమాదేవి, శ్రీదేవి, జయభారతి, సుబ్బలక్ష్మి, చంద్రశేఖర్, నరేష్, సుధాకర్, రమేష్, రామకృష్ణ, సూపరింటెండెంట్ బీబీ విజయసాగర్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

ఇసుక ర్యాంపులో కూటమి వర్గపోరు

ర్యాంపును తాత్కాలికంగా నిలిపి వేసిన రెవెన్యూ అధికారులు


పశువుల్లంక ఇసుక ర్యాంపులో ఇరువర్గాల మధ్య వాగ్వాదం

ఐ.పోలవరం: మండలంలోని పశువుల్లంక ఇసుక ర్యాంపులో ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక పథకం మాటున కాసులు వెనుకేసుకునేందుకు తెలుగు తమ్ముళ్లు ఎవరికి వారే తమ ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పశువుల్లంక ర్యాంపులో నుంచి ఇసుక తరలించేందుకు బుధవారం అధికార పార్టీలోని రెండు వర్గాలు ప్రయత్నించాయి. అయితే గోదావరిలో ఇసుక తీస్తున్న ఒక వర్గానికి చెందిన మూడు పడవలను మరో వర్గం వారు అడ్డుకున్నారు. మహిళలతో పాటు పలువురు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుని ఆందోళనకు దిగారు. దీంతో ఈ వివాదం కూటమి నాయకుల వద్దకు వెళ్లింది. అయినప్పటికీ ఇరు వర్గాల వారూ ససేమిరా అంటూ వివాదానికి తెర తీశారు ఒక వర్గానికి చెందిన పడవలను కదలనిచ్చేది లేదంటూ మరో వర్గం ఆందోళనకు దిగింది. దీంతో ఆ గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు ఈ వివాదాన్ని తహసీల్దార్ వద్దకు తీసుకు వెళ్లారు. రెవెన్యూ అధికారులు ఇసుక ర్యాంపు వద్దకు చేరుకుని వివాదం సద్దుమణిగే వరకూ ర్యాంపు నుంచి ఇసుక తరలించవద్దని ర్యాంపును తాత్కాలికంగా నిలిపివేశారు.దీంతో ఇరువర్గాల వారూ వెను దిరిగారు.

ఘనంగా కార్తిక దీపోత్సవం


కార్తిక దీపోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

ఐ.పోలవరం: మండలంలోని పెదమడి శ్రీకల్యాణ రామస్వామి శెట్టిబలిజ కమిటీ ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. సమరసత సేవా ఫౌండేషన్ ముమ్మిడివరం సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ బొంతు కనకారావు పర్యవేక్షణలో ఓంకారం స్వస్తిక్ శివలింగం ఆకృతుల్లో ఏర్పాటు చేశారు. పూజాదికాలు పూర్తి చేసి భక్తిశ్రద్ధలతో శివ నామస్మరణ చేస్తూ దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ప్రణవ ఆశ్రమ వ్యవస్థాపకుడు శ్రీస్వామిని సుమిత్రా నంద సరస్వతి మాతాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్తిక మాసంలో ప్రాతః కాలంలో స్నానమాచరించి ధ్యానం నామస్మరణ చేయడం ద్వారా మనసు నిర్మలంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ మనసులో జ్ఞాన జ్యోతిని వెలిగించుకోవాలని, తద్వారా భగవంతుని దర్శించగలుగుతామన్నారు. సాగిరాజు బాపిరాజు, తోట చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యం

అమలాపురం రూరల్: ఇటీవల జరిగిన క్రీడాశాఖ సమీక్షలో క్రీడారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విధాన నిర్ణయాలు తీసుకున్నారని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ముఖ్య శిక్షకులు పి.సురేష్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఇతర రాష్ట్రాల కంటే మిన్నగా ఏపీ క్రీడా పాలసీని ప్రవేశపెట్టారన్నారు ఇప్పటివరకు 2 శాతం ఉన్న క్రీడా రిజర్వేషన్లను 3 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారన్నారు. తొలుత దీనిని యూనిఫాం సర్వీసెస్‌లో అమలు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. అమరావతిని క్రీడా హబ్‌గా మార్చేందుకు వీలుగా నూతన క్రీడా పాలసీని రూపొందించారని చెప్పారు.

కేళీ.. ఇదో రకం మోళీ

- కోమలి 1,318 రకం వరి విత్తనాల్లో కలసిన మరో రకం
- కొత్తపేట మండలంలో 600 ఎకరాల్లో రైతులకు నష్టం

కొత్తపేట: సాగులో అన్నీ ఆటంకాలే.. విత్తు నుంచి పంట చేతికి వచ్చే వరకూ ఇబ్బందులే.. ఎన్నో ఆశలతో సాగు చేపట్టిన వరి పంటలో మూడొంతులు ఒక రకం, ఓ వంతు వేరే రకం (కేళీలు) పండడంతో రైతులు నోరెళ్లబెడుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ (తొలకరి) సీజన్ వరి పంట సాగులో అధిక దిగుబడులు వస్తాయని ఒక వరి రకాన్ని కొనుగోలు చేసి పండించారు. తీరా ఈనిక దశ వచ్చేసరికి కేళీల రకం వరి ముందుగా, అసలు రకం వరి తరువాత ఈనింది. ఆ విధంగా మూడో వంతు నష్టం వచ్చిందని పలువురు రైతులు వాపోయారు. కొత్తపేట మండల పరిధిలోని రైతులు ఎంటీయూ 7,029 (స్వర్ణ), ఎంటీయూ 1,318 రకాలు సాగు చేశారు. ఇందులో కొందరు తమ సొంతంగా కట్టిన విత్తనాలు, మరి కొందరు ఇతర రైతుల వద్ద, మరికొందరు స్థానిక ప్రైవేట్ డీలర్ల వద్ద కొనుగోలు చేశారు. ఇందులో భాగంగా 'కోమలి 1,318' అనే వరి రకం పండించిన కొందరు రైతుల చేలల్లో వేరే రకం (కేళీలు) కలిశాయి. సుమారు నెల క్రితం చేను అంతా ఒకేసారి ఈనకుండా మధ్య మధ్యలో సుమారు మూడొంతుల్లో ఒక వంతు మేర వేరే రకం వరి ఈనేసింది. మిగిలిన రెండు వంతులు ఈనకుండా పాలుపోసుకుంటుంది. ఈ రకం విత్తనాలు వరి పండించిన రైతులు మా చేను కూడా అలాగే రెండు రకాలుగా ఉందని ఆయా రైతులు వాపోయారు. కొత్తపేట శివారు చినగూళ్లపాలెం, పెదగూళ్లపాలెం, పనసలదొడ్డి ప్రాంతాలు, మండలంలోని అవిడి, పలివెల, ఖండ్రిగ, రావులపాలెం మండలం దేవరపల్లి శివారు మట్లదొడ్డి గ్రామాలకు చెందిన పలువురు రైతులు సుమారు 600 ఎకరాల్లో సాగు చేశారు. ఈ విత్తనాలను స్థానిక సిరి సంపద సీడ్స్ విత్తనాల షాపులో తెలంగాణకు చెందిన యాగంటి ఆగ్రోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ వారి 'కోమలి 1318' అనే వరి రకం విత్తనాలు 20 కిలోల ప్యాకెట్ రూ.1,500 చొప్పున కొనుగోలు చేశారు. కేళీల సమస్యను బాధిత రైతులు సంబంధిత డీలర్ ద్వారా కంపెనీ దృష్టికి తీసుకువెళ్లారు. కంపెనీ తరఫున సిబ్బంది వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వెళ్లారు. ఇది జరిగి సుమారు నెల రోజులుగా నడుస్తుంది. కానీ ఇంతవరకూ రైతులకు జరిగిన నష్టంపై తగిన హామీ మాత్రం ఎవరూ ఇవ్వలేదు. ఐ.పోలవరం మండలంలోని సుమారు 50 ఎకరాల్లో ఇదే రకం విత్తనాల్లో కేళీల సమస్య ఏర్పడినట్టు తెలిసింది. అయితే బాధిత రైతులకు న్యాయం చేకూర్చేలా కంపెనీ, డీలర్ హామీ ఇచ్చినట్టు సమాచారం. కొత్తపేటలో మాత్రం సుమారు 20 రోజులుగా ఏ విధమైన హామీ లభించకపోవడంతో మంగళవారం సుమారు 30 మంది రైతులు అమలాపురం వచ్చిన రాష్ట్ర మంత్రి కె.అచ్చన్నాయుడుకు వినతిపత్రం సమర్పించారు. న్యాయం జరగకపోతే ఆందోళన చేపడతామని అన్నారు.


కొత్తపేటలో కేళీల వరి చేను


కొత్తపేటలో కేళీల వరి చేను పరిశీలిస్తున్న ఏఓ పద్మలత

నష్టపరిహారం చెల్లించాలి



నేను 2.2 ఎకరాల విస్తీర్ణంలో కోమలి 1,318 రకం వరి సాగు చేశాను. సుమారు 30 వేలు పెట్టుబడి పెట్టాను. తీరా ఈనిక దశ వచ్చేసరికి ఒకదాని తరువాత ఒకటిగా రెండు రకాలు ఈనాయి. సాధారణంగా ఎకరానికి 30 నుంచి 35 బస్తాల దిగుబడి వస్తాయి. కానీ ఇప్పుడు కేళీల కారణంగా 10 బస్తాలకు పైగా దిగుబడి తగ్గి, సుమారు రూ.15 వేల నష్టం వస్తుంది. దీనికి సంబంధిత కంపెనీ బాధ్యత వహించి నష్టపరిహారం చెల్లించాలి.

– దూనబోయిన హరినాథ్, కౌలురైతు, పెదగూళ్లపాలెం, కొత్తపేట

ఎకరానికి 10 బస్తాల నష్టం



నేను 1.5 ఎకరాల్లో కోమలి 1,318 వరి రకం సాగు చేశాను. ఆ విత్తనాలు స్థానిక సిరిసంపద విత్తనాల షాపులో ప్యాకెట్ రూ.1,500కు కొనుగోలు చేశాను. మొత్తం చేనంతా కేళీలే. మూడు వంతుల్లో రెండు వంతులు 1,318 రకం కాగా, మరో వంతు వేరే రకం. అది ముందుగా ఈనిక రాగా అసలు విత్తనం తరువాత ఈనింది. ఇది కోతకు వచ్చే సమయానికి కేళీ రకం రాలిపోతుంది. ఈ విధంగా సుమారు 10 బస్తాల దిగుబడి తగ్గింది.

– అప్పారి వీరవెంకట సత్యనారాయణ, కౌలు రైతు, చినగూళ్లపాలెం